7
సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025

పట్టభద్రుల ఓట్లు పోలైనవి	శాతం	పట్టభద్రుల ఓట్లు పోలైనవి	శాతం	పట్టభద్రుల ఓట్లు పోలైనవి	శాతం	పట్టభద్రుల ఓట్లు పోలైనవి	శాతం	పట్టభద్రుల ఓట్లు పోలైనవి	శాతం
2,298	7.4	6,533	21.13	11,045	35.72	18,701	60.48	20,811	67.30
297	17.85	692	41.59	944	56.73	1,474	88.58	1,527	91.77



రెండు గంటలకోసారి ఓటింగ్ సరళి | పట్టభద్రుల ఓట్లు: పోలైనవి, శాతం | ఉపాధ్యాయుల ఓట్లు: పోలైనవి, శాతం

న్యూస్‌రీల్

ఓటు వేసేందుకు సింగరేణి వెసులుబాటు

శ్రీరాంపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న సింగరేణి పట్టభద్రులైన ఉద్యోగులు ఓటు వేయడానికి సంస్థ వెసులుబాటు కల్పించింది. గురువారం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కానీ ఉద్యోగుల విధి నిర్వహణ సమయంలో రెండు గంటలు వెసులుబాటు కల్పించింది. రెండో షిఫ్ట్, రాత్రి షిఫ్ట్ ఉద్యోగులకు ఓటు వేయడానికి అవకాశం ఉంది. మొదటి షిఫ్ట్ ఉద్యోగులకు సమయం సరిపోదు. దీంతో మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు ఓటు వేసి వచ్చేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో వారంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో పట్టభద్రులైన ఉద్యోగులు సుమారు 3,200 మంది ఉన్నట్లు అంచనా. ఇటీవల కారుణ్య ఉద్యోగాలు, నోటిఫికేషన్లలో వేలాది మంది యువకులు కంపెనీలో ఉద్యోగాల్లో చేరారు. వీరిలో అధిక శాతం డిగ్రీ, ఆపై చదివిన వారు ఉండడం గమనార్హం.

ఎస్టీపీపీలో కొత్త ప్లాంటు పనులపై సమావేశం


మాట్లాడుతున్న ఇంచార్జీ ఈడీ శ్రీనివాసులు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) విస్తరణలో భాగంగా నూతనంగా నిర్మించనున్న 800మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు పనులపై సన్నాహక సమావేశం నిర్వహించారు. గురువారం ఎస్టీపీపీ అడ్మిన్ భవన కార్యాలయంలో ఇంచార్జీ ఈడీ శ్రీనివాసులు నేతృత్వంలో ఆయా శాఖల అధికారులతో చర్చించారు. మూడో యూనిట్ నిర్మాణానికి అన్ని అనుమతులు లభించాయని, రాబోయే కొద్ది రోజుల్లో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ మేరకు సివిల్ వర్క్స్, ఇంజినీరింగ్, ఫారెస్ట్, ఎలక్ట్రికల్, ఆపరేషన్స్, నిర్వహణ పనులపై ఆయా విభాగాధిపతులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎస్టీపీపీ వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, కొత్త ప్లాంటు కోర్డినేటర్ వేణుగోపాల్‌రావు, డీజీఎం పర్సనల్ అజ్మీరాతుకరాం, ఎస్‌వోటు డీఈ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సర్కారు బడి విద్యార్థులకు ట్యాబ్‌లు


పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడి విద్యార్థులకు ట్యాబ్‌లు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక విద్య అమల్లో భాగంగా చర్యలు వేగవంతం చేశాయి. ఇప్పటికే పీఎంశ్రీ లో ఎంపిక చేసిన పాఠశాలలకు మొదటి విడతలో కంప్యూటర్లు, యూపీఎస్, ఇన్వర్టర్లు మంజూరు చే యగా విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చేందుకు కసరత్తు పూర్తయింది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా బోధన చేయనున్నారు. ఉపాధ్యాయులు బోర్డుపై బోధించే అంశాలను నేరుగా చూసేలా అవకాశం కల్పించనున్నారు. ఒక్కో పాఠశాలకు 25 ట్యాబ్‌లను త్వరలోనే సరఫరా చేయనున్నారు. సెల్‌కాన్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సాంసంగ్ ఏ7 లైట్(ఎస్ఎం-టీ 225) ట్యాబ్‌లు మంజూరు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఎంశ్రీ కింద ఎంపికైన ఒక్కో పాఠశాలకు 25 చొప్పున 1350 ట్యాబ్‌లు మొదటి విడతలో మంజూరయ్యాయి. త్వ రగా ట్యాబ్‌లను విద్యార్థులకు అందించి పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలు, అనుమానాలను నివృత్తి చేసేలా బోధన చేయనున్నారు.

జిల్లా	పాఠశాలలు	ట్యాబ్‌లు
ఆదిలాబాద్	13	325
ఆసిఫాబాద్	10	250
మంచిర్యాల	16	400
నిర్మల్	15	375

కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ డీసీపీ భాస్కర్‌ను కోరారు. గురువారం డీసీపీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే అండతో జగన్‌మోహన్‌రావు దౌర్జన్యాలు, రౌడీయిజం, ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని ఆరోపించారు. బీజేపీ నాయకులు వెరబెల్లి రఘునాథ్‌రావు, నాయకులు దుర్గం అశోక్, గాజుల ముకేష్‌గౌడ్, పెద్దపెల్లి పురుషోత్తం, పురుషోత్తం జాజు, జోగుల శ్రీదేవి పాల్గొన్నారు.


హాజీపూర్‌లో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు


జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఓటేస్తున్న టీచరు

తీర్పు నిక్షిప్తం


చెన్నూర్: ఓటేసిన ట్రాన్స్‌జెండర్ అను




ఓటేసిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు


ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


హాజీపూర్‌లో ఓటు వేసిన మహిళా ఓటర్లు

- జిల్లాలో ముగిసిన ఎమ్మెల్సీ ఓటింగ్
- ఉదయం నుంచే పోటెత్తిన టీచర్లు
- ఓటేయడంలో వెనుకబడ్డ పట్టభద్రులు
- పట్టభద్రులు 67.30శాతం, టీచర్లు 91.77శాతం నమోదు

	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	పోలైనవి	శాతం
పట్టభద్రులు	30, 921	19,041	11,880	20,811	67.30
ఉపాధ్యాయ	1,664	999	665	1,527	91.77

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల స్థానానికి 56మంది, ఉపాధ్యాయ స్థానానికి 15మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పట్టభద్రుల ఓటింగ్ 67.30శాతం, టీచర్ల ఓటింగ్ 91.77శాతం నమోదు కాగా.. అభ్యర్థుల భవిష్యత్ బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా.. పట్టభద్రులతో పోలిస్తే టీచర్లు ఉదయం నుంచే ఓటు వేసేందుకు బారులు తీరారు. మధ్యాహ్నం వరకు పట్టభద్రులు క్రమంగా అధిక సంఖ్యలో వచ్చారు. కలెక్టర్ కుమార్ దీపక్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీలు, సీఐ, స్థానిక ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు వెబ్‌కాస్టింగ్‌లో ప్రత్యేక సిబ్బందితో పర్యవేక్షించారు. పలు కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ పరిస్థితి తెలుసుకున్నారు. నస్పూర్ పరిధి తీగల్‌పహాడ్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎస్సై బీజేపీ నాయకులపై చేయి చేసుకున్నారంటూ నిరసన చేపట్టారు. పోలీసు ఉన్నతాధికారుల రాకతో గొడవ సద్దుమణిగింది. ఇక జైపూర్ మండల కేంద్రానికి చెందిన పట్టభద్రుడు మల్లాగౌడ్ తన ఓటును వేరే వాళ్లు వేశారంటూ అధికారులను నిలదీయడంతో మళ్లీ ఆయనతో టెండరు ఓటు వేయించారు. ఇక ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల పట్టభద్రులు ఓటేయడంలో తడబడ్డారు. పెద్ద బ్యాలెట్ పేపర్, 56మంది అభ్యర్థులు ఉండడంతో ప్రాధాన్యత ఇవ్వడంలో నెమ్మదిగా ఓటేయాల్సి వచ్చింది. కొందరు ఆలస్యంగా రావడంతో సాయంత్రం 4గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది. నిర్ణీత సమయానికి వరుసలో ఉన్న వారందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. ఆ తర్వాత పటిష్ట బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్సులను సీల్ వేసి స్ట్రాంగ్ రూంకు తరలించారు.

ఉపాధ్యాయులు భేష్..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓటర్లు దాదాపు పూర్తి స్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లలో 137మంది మాత్రమే ఓటుకు దూరంగా ఉన్నారు. మొత్తంగా 92శాతం ఓట్లు పోలయ్యాయి. కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి పరిధిలో టీచర్ల ఓటర్లు నాలుగు, రెండు, ఎనిమిది చొప్పున ఉన్నారు. దీంతో నిర్ణీత సమయం కంటే తక్కువ సమయంలోనే పోలింగ్ పూర్తయింది. ఇక పట్టభద్రుల స్థానంలో ఉదయం నుంచే చాలా మంది ఓటర్లలో నిరాసక్తత కనిపించగా, మధ్యాహ్నం వరకు పెరుగుతూ వచ్చింది. మొత్తం ఓట్లలో 10,110మంది ఓటర్లు తమ ఓటు హక్కుకు దూరంగా ఉన్నారు. జిల్లాలో 67శాతమే పోలింగ్ నమోదైంది. చాలా చోట్ల ఇతర ప్రాంతాల్లో ఉండడం, ఓటు వేయాలనే ఆసక్తి లేకపోవడంతో సొంతూళ్లకు వచ్చి ఓటేసేందుకు ఇష్టపడకపోవడంతో పోలింగ్ శాతం తగ్గింది.

నస్పూర్‌లో ఉద్రిక్తత

- ఎస్సై చేయి చేసుకున్నాడని బీజేపీ నాయకుడి ఆరోపణ
- జాతీయ రహదారిపై శ్రేణుల రాస్తారోకో
- సీపీ, డీసీపీల జోక్యంతో సద్దుమణిగిన వివాదం


రహదారిపై బైఠాయించిన బీజేపీ నాయకులు


ఎస్సై సుగుణాకర్‌తో కమలాకర్‌రావు వాగ్వాదం

నస్పూర్: నస్పూర్ పట్టణంలో పోలింగ్ సమయంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పట్టణంలో 4,254మంది పట్టభద్రులు, 102 టీచర్ ఓటర్లు ఉన్నారు. తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం 4గంటల వరకే ఓటింగ్ సమయం కాగా.. అప్పటికే బారులు తీరి ఉండడంతో సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. టీచర్ల పోలింగ్ 85శాతం, పట్టభద్రుల ఓటింగ్ 65.48శాతం నమోదైంది. ఉదయం 11.30గంటల ప్రాంతంలో బీజేపీ, నాయకుల మధ్య ఘర్షణతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీజేపీకి చెందిన కమలాకర్‌రావు బారికేడ్లను దాటుకుని పోలింగ్ కేంద్రం వైపు వస్తుండగా ఎస్సై సుగుణాకర్ అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులు టెంట్లు వేసుకుని కూర్చుంటే లేని అభ్యంతరం తమపై ఎందుకని ప్రశ్నించాడు. కాంగ్రెస్ నాయకులనూ పంపించాలని కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఎస్సై తనపై చేయి చేసుకున్నాడని ఆరోపించారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బీజేపీ నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అక్కడికి చేరుకుని శ్రేణులకు మద్దతు తెలిపారు. పోలీసులు సర్ది చెప్పి పక్కకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో కొందరు బీజేపీ నాయకులపై రాళ్లు రువ్వారు. దీంతో బీజేపీ నాయకులు కాంగ్రెస్ నాయకులపైకి దూసుకెళ్లారు. రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ(అడ్మిన్) రాజు తమ సిబ్బందితో ఇరుపక్షాలను చెదరగొట్టి గొడవ సద్దుమణిగేలా చేశారు. కమలాకర్‌రావును పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు పార్టీల నాయకులకు సర్దిచెప్పి పంపించామని, లాఠీచార్జి చేయలేదని, కమలాకర్‌రావు ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పాతమంచిర్యాల: జిల్లాలో గురువారం నిర్వహించిన శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల, తీగల్‌పహాడ్‌లోని ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండేతో కలిసి సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శిరీష, అధికారులు పాల్గొన్నారు.



మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన టీచర్లు


లక్సెట్టిపేట: కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి


దండేపల్లి: బారులు తీరిన పట్టభద్ర ఓటర్లు


లక్సెట్టిపేటలో సీపీ శ్రీనివాస్ పర్యవేక్షణ

ఇంటి పన్ను పోటు!

- మంచిర్యాల కార్పొరేషన్‌లో నస్పూర్ మున్సిపాల్టీ, గ్రామాల విలీనం
- పెరిగిన పన్ను డిమాండ్
- బకాయిదారుల జాబితా సిద్ధం


మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్ను వసూళ్లకు అధికార యంత్రాంగం తిప్పలు పడుతోంది. మున్సిపాల్టీ, గ్రామాల విలీనంతో పన్ను డిమాండ్ పెరిగి వసూలు శాతం పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో మంచిర్యాల మున్సిపాల్టీలో నస్పూర్ మున్సిపాల్టీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట్, నర్సింగాపూర్, నంనూరు, చందనాపూర్, ముల్కల్ల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కార్పొరేషన్ కేంద్రంగానే పాలన కొనసాగుతోంది. పన్ను వసూళ్లకు మార్చి 31వరకు గడువు ఉండడం, పన్ను వసూళ్లతోనే కార్పొరేషన్ అభివృద్ధి ఆధారపడి ఉండడంతో వంద శాతం వసూలుపై అధికారులు దృష్టి సారించారు. గత నెల జనవరి 28నుంచి ఫిబ్రవరి 6వరకు నస్పూరు మున్సిపాలిటీతోపాటు ఎనిమిది గ్రామాల రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. పన్ను వసూళ్లు 40శాతం మాత్రమే కావడంతో వంద శాతం లక్ష్యం చేరడంపై తర్జన భర్జన పడుతున్నారు.

బకాయిలపైనే దృష్టి

మంచిర్యాల మున్సిపాలిటీలో 27వేల ఇళ్లు, రూ.18 కోట్ల పన్ను డిమాండ్ ఉండేది. కార్పొరేషన్‌గా మారక ముందు అంటే గత నెల 28వరకు రూ.7 కోట్ల పన్ను మాత్రమే వసూలైంది. కార్పొరేషన్ ఏర్పాటు తర్వాత ఇళ్ల సంఖ్య 45,327కు, పన్ను డిమాండ్ రూ.26.04 కోట్లకు చేరింది. రూ.10.38 కోట్లు మాత్రమే పన్ను వసూలైంది. విలీనానికి ముందు నస్పూరు మున్సిపాలిటీ పరిధిలో 16,026 ఇళ్లు, రూ.4.27 కోట్లు పన్ను డిమాండ్ ఉంది. విలీనం తర్వాత డిమాండ్ మొత్తం కార్పొరేషన్‌లో కలిసింది. విలీన గ్రామాల్లోనూ పన్ను బకాయిలు ఎక్కువగా ఉండగా, అవి కూడా కార్పొరేషన్‌లోనే కలవడంతో బకాయిలు పెరిగాయి. ప్రస్తుతం సమయం 30రోజుల్లోపే ఉండడంతో పన్ను చెల్లింపులపై ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలు, పెద్ద మొత్తంలో బకాయిదారులు ఎవరున్నారనే జాబితా సిద్ధం చేస్తున్నారు. ముందుగా నోటీసులు అందజేయాలని, స్పందన రానిపక్షంలో చట్టపరంగా జప్తు వంటి చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఏళ్ల తరబడి కొందరు పన్నులు చెల్లించకపోవడంతో ఆదాయం సమకూరక అభివృద్ధితోపాటు ఔట్ సోర్సింగ్ సిబ్బంది, కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఎదురవుతోంది.

మంచిర్యాల కార్పొరేషన్ వివరాలు

మొత్తం ఇళ్లు	45,327
రావాల్సిన పన్ను డిమాండ్	రూ.26.04 కోట్లు
ఈ నెల 27వరకు వసూలు	రూ.10.38 కోట్లు
వసూలైన శాతం	40 శాతం
చెల్లింపులకు ఉన్న గడువు	మార్చి 31

వడ్డీ మాఫీ ఉంటుందనే..!

కార్పొరేషన్ పరిధిలోని సాధారణ, మధ్యతరగతి ప్రజలు పన్ను ప్రతియేటా చెల్లిస్తున్నారు. బడా వ్యాపారులు, ప్రముఖులు, పెద్ద భవనాలు ఉండి, కోట్ల వ్యాపారం చేస్తున్న వారిలోనే ఎక్కువ మంది పన్ను చెల్లింపులకు ముందుకు రావడం లేదు. మార్కెట్‌లో భవనాలు కలిగిన వ్యాపారుల్లో చాలా మంది రూ.40 లక్షలకు పైగానే ఆస్తిపన్ను బకాయిలు ఉన్నారు. సిబ్బంది వసూళ్లకు వెళ్లిన సమయంలో రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. ఏటా పన్ను చెల్లింపులు చేయకుండా బకాయి పడుతున్నారు. ప్రభుత్వం అప్పుడప్పుడు మార్చిలో పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తుండడంతో వ్యాపారులు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ అధికారులు ఈ ఏడాది పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

వందశాతం వసూలు చేస్తాం

ఈ ఏడాది వందశాతం పన్నుల వసూలు కు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు ఇంటింటికి వెళ్తున్నారు. ప్రజ లకు అవగాహన కల్పిస్తున్నాం. కార్పొరేషన్‌గా మారినంత మాత్రాన పన్ను పెంపు ఏమి ఉండదు. బకాయిలు చెల్లించని వారికి నోటీసులు అందజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం పన్ను బకాయిలపై ఎలాంటి వడ్డీ మాఫీ ప్రకటించలేదు. బకాయిదారులు పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– శివాజీ, మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్

వేలాలకు పోటెత్తిన భక్తులు


గర్భగుడిలో ప్రత్యేక అలంకరణలో శివలింగం


లక్ష్మీదేవరుల ప్రదర్శన

- శివసత్తుల పూనకాలు
- లక్ష్మీదేవరుల ప్రదర్శన

జైపూర్: మండలంలోని వేలాల జాతరకు రెండో రోజు గురువారమూ భక్తులు పోటెత్తారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, సిరోంచా, గడ్చిరోలి నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ప్రతియేటా మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జాతర సాగుతుంది. తొలి రోజు బుధవారం భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గట్టు మల్లన్న సన్నిధికి చేరుకుని దొనలో స్వయంభూగా వెలిసిన మల్లన్నస్వామికి బోనాలు, పట్నాలతో మొక్కులు చెల్లించారు. రాత్రంతా జాగారం చేసిన భక్తులు గురువారం తెల్లవారుజామున గోదావరి నదిలో స్నానాలు ఆచరించి దర్శనానికి బారులు తీరారు. దర్శనానికి ఐదుగంటలకు పైగా సమయం పట్టింది. శివసత్తుల పూనకాలు, లయబద్ధక నృత్యాలు, లక్ష్మీదేవరుల ప్రదర్శనలు, ఒగ్గు పూజారుల ఢమరుక మోతలతో వేలాల పరిసరాలు మార్మోగాయి. పోలీసులు 600 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 50కి పైగా సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.


దర్శనానికి బారులు తీరిన భక్తులు

క్లుప్తంగా

చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లాకేంద్రంలోని ఖానాపూర్‌ చెరువులో యువకుడి మృతదేహం లభ్యమైనట్లు వన్‌టౌన్‌ సీఐ సునీల్‌ కుమార్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన పిట్ల సాయి కుమార్‌ (29) ఈనెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆయన కుటుంబీకులు 25న అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. గురువారం ఖానాపూర్‌ చెరువులో మృతదేహం నీటిపై తేలి ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురిపై రౌడీషీట్‌ ఓపెన్‌

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన రవితేజను హత్య చేసిన కేసులో నిందితులుగా ఉన్న గోల్డెన్‌ కార్తీక్‌, ప్రణీ త్‌, సాయికిరణ్‌లపై రౌడీషీట్‌ ఓపెన్‌ చేసిన ట్లు టూటౌన్‌ సీఐ కరుణాకర్‌రావు తెలి పారు. ఈముగ్గురు నిందితులతో సంబంధాలు ఉండి అల్లర్లకు పాల్పడిన ఆరుగురిని ఆదిలాబాద్‌ అర్బన్‌ తహసీల్దార్‌ ఎదుట గురువారం బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట ఆడుతున్న 11 మంది అరెస్ట్‌

రామకృష్ణాపూర్‌: రామకృష్ణాపూర్‌ పోలీసుస్టేషన్‌ పరిధి తిమ్మాపూర్‌ గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. ముత్యాల ప్రదీప్‌ ఇంట్లో రహస్యంగా పేకాటాడుతున్నారన్న సమాచారంతో బుధవారం రాత్రి దాడి చేసి 11 మందిని అదుపులో తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.38,290 నగదు, నాలుగు బైక్‌లు, ఒక కారు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఊడిపోయిన ఆటోటైర్‌



ఖానాపూర్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల సమీపంలో గల ప్రధాన రహదారిపై గురువారం ఆటో టైర్‌ ఊడిపోయింది. నిర్మల్‌ నుంచి ఖానాపూర్‌కు ఆటోలో ఇనుప రేకులతోపాటు పైపులు తీసుకువస్తుండగా లోడ్‌ ఎక్కువై టైర్‌ ఊడిపోయింది. దీంతో ఒక్కసారిగా ఆటో కుప్పకూలింది. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆటో బోల్తా: ఒకరికి గాయాలు

ముధోల్‌: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ముధోల్‌–భైంసా ప్రధాన రహదారిపై గురువారం ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మహారాష్ట్ర ధర్మాబాద్‌ తాలూకా నయాగావ్‌ గ్రామానికి చెందిన నాగేష్‌ తన ఆటోలో పని నిమిత్తం భైంసాకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులు గమనించి 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. నాగేష్‌ మద్యం మత్తులో ఉండడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

ప్రణాళికతో చదివితే మార్కులు

- పాఠాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి
- సందేహాలకు నివృత్తి అవసరం
- సూచనలు చేస్తున్న విషయ నిపుణులు

పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు కష్టపడి చదవాలి. సబ్జెక్టుల వారీగా సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి. ప్రతీ పాఠాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవడంతోపాటు సొంత బుక్‌ తయారు చేసుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదివితే మంచి గ్రేడ్‌ సాధించవచ్చునని విషయ నిపుణులు సూచిస్తున్నారు. – లక్ష్మణచాంద



లక్ష్మణచాంద ఉన్నత పాఠశాలలో చదువుతున్న పది విద్యార్థులు

భౌతిక, రసాయన శాస్త్రం..



సురేష్‌బాబు

భౌతిక, రసాయన శాస్త్రంలో మంచి మార్కులు సాధించాలంటే పాఠాలను అర్థం చేసుకోవాలని లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు సురేష్‌బాబు తెలిపారు.

- పుటాకార దర్పణాల, కుంభకారా దర్పణాల కిరణ చిత్రాలు బాగా సాధన చేయాలి.
- తుల్య రసాయన సమీకరణాలకు సంబంధించిన సమస్యలు ప్రాక్టీస్‌ చేయాలి.
- ఆమ్లా, క్షారాలా పీహెచ్‌ విలువలు గుర్తుంచుకోవాలి.
- దీర్ఘ దృష్టి, హ్రస్వ దృష్టి గురించి వేసే ప్రశ్నలపై సమాధానాలు రాయాలి.
- 20 మూలకాల ఎలక్ట్రాన్‌ విన్యాసం తెలిసి ఉండాలి.
- పౌలీ వర్జన నియమం, ఆఫ్‌ బౌ నియమం, హుండ్‌ నియమం చదువుకోవాలి.
- ఆధునిక అవర్తన పట్టిక ధర్మాలు ప్రతిసారి ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- లోహ శాస్త్రంలో ఖనిజాలు, దాతువులు వాటి ఫార్ములాలు తెలిసి ఉండాలి.
- కర్బన రసాయన శాస్త్రంలో ఆల్కేన్‌, ఆల్కీన్‌, ఆల్కైన్‌ల మధ్య భేదాలు తెలిసి ఉండాలి. నామీకరణ సూత్రాలు చదువుకోవాలి.

సాంఘిక శాస్త్రం..



సిలారి మధు

సమకాలీన అంశాలపై పట్టు, విశ్లేషణాత్మక ధోరణి ఉంటే సాంఘిక శాస్త్రంలో విజయం తథ్యమని నిర్మల్‌ జిల్లా గుండంపెల్లి ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సిలారి మధు అంటున్నాడు.

- బట్టీ పద్ధతిని వదిలేసి పాఠాలను అర్థం చేసుకోవాలి.
- దేశంలోని నదులు, పీఠ భూములు, ఎత్తైన శిఖరాలు, పర్వత శ్రేణులు, తీర ప్రాంతాలు, ప్రధాన నగరాలు, ప్రపంచీకరణ, పట్టణీకరణ పర్యావరణ, భూగర్భ జల సమస్యలు తదితర అంశాలపై అవగాహన చేసుకోవాలి.
- గ్రాఫ్‌లు పట్టికలు, పై చార్ట్‌లు విశ్లేషణాత్మక ధోరణిలో రాయాలి.
- ప్రపంచ పటంలో మిత్ర రాజ్య కూటమి దేశాలు, అక్షరాజ్య కూటమి దేశాలు, నినాదాలు, కరపత్రం తదితర వాటి గురించి తెలుసుకోవాలి.
- ప్రతీ సిలబస్‌లో ముఖ్యమైన పాయింట్లను అండర్‌లైన్‌ చేసుకుని చదవాలి. బిట్‌ పేపర్‌లో వచ్చే 20 మార్కులను సులభంగా సాధించవచ్చు.
- ప్రశ్నపత్రంలో ముందుగా ప్రశ్నల సరళిని అవగతం చేసుకోవాలి.

గణితం..



జె.శ్రీనివాస్‌

గణితం అంటే విద్యార్థులు భయపడుతారు. ప్రణాళిక ప్రకారం చదివితే గణితంలో సులువుగా మార్కులు సాధించవచ్చని నిర్మల్‌ జిల్లా పాత ఎల్లాపూర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు జె.శ్రీనివాస్‌ పేర్కొన్నారు.

వాస్తవ సంఖ్యలు: సంయుక్త సంఖ్యలను ప్రధాన కారణాంకల లబ్దంగా రాయడం, యూక్లిడ్‌ భాగాహార న్యాయం ఆధారంగా గాసాభా కనుగొనడం, ధన బేసి, సరిసంఖ్య రూపం, కరణీయ సంఖ్య అని చూపడం, సంవర్గమనం, లాఘరిథమ్స్‌ సమస్యలను ప్రాక్టీస్‌ చేయాలి.

సమితిలు: శూన్య, వియుక్త సమితి నిర్వచనాలు, సమితి నిర్మాణ, జాబితా రూపం రాయడం, వీటికి ఉదాహరణలు సమితి సమ్మేళనం, ఛేదనము సమస్యలను సాధించడం, వెన్‌ చిత్రాలను గీయడం ప్రాక్టీస్‌ చేయాలి.

బహుపదులు: బహుపది శూన్య విలువలు కనుగొనడం, గ్రాఫ్‌ నుంచి శూన్యాలను చెప్పడం, వర్గ, ఘన బహుపదుల శూన్యాలు కనుగొనాలి.

వర్గ సమీకరణాలు: విచక్షిని కనుగొని మూలాల స్వభావం చెప్పడం, ఆల్ఫా, బీటాలు మూలాలుగా గల వర్గ సమీకరణం రాయడం, రాత సమస్యలకు వర్గ సమీకరణం రాసి గ్రాఫ్‌ ద్వారా శూన్యాలు కనుగొనాలి.

చర రాశుల్లో రేఖీయ సమీకరణాలు: సంగతా, అసంగతా, పరస్పర ఆధారిత సమీకరణాలు ఎలా అవుతాయి, వీటిని కనుగొనడం, సమీకరణాలను చర రాశిని తొలగించడం, ప్రతిక్షేపన పద్ధతి, గ్రాఫ్‌ పద్ధతుల ద్వారా సాధించాలి.

సరూప త్రిభుజాలు: ప్రాథమిక అనుపాత సిద్ధాంతానికి అనువర్తన సమస్యలు, సరూప త్రిభుజాలు నిర్మాణాలు గీయడం.

శ్రేడులు: అంక,గుణ శ్రేడుల్లో మొదటి పదం, సామాన్య భేదం, నిష్పత్తులను కనుగొనడం, అంక శ్రేడీలో N వ పదం, N పదాల మొత్తం సంబంధించి సమస్యలు సాధించాలి.

సాంఖ్యక శాస్త్రం: ముడి దత్తాంశం ఇచ్చి సగటు, మధ్యగతం, భాహులకాం కనుగొనడం, సగటు, మధ్యగతం, బాహులకం సూత్రం రాసి అందులో పదాలను వివరించాలి. వర్గీకత దత్తాంశానికి సగటు, మధ్యాగతం, బాహులకం కనుగొనాలి. ఓజీవ్‌ వక్రాలను గీయడం వంటి వాటిపై సాధన చేయాలి.

జీవశాస్త్రం



గంగ సురేశ్‌

జీవశాస్త్రంలో పాఠాలను అర్థం చేసుకుని చదవాలని నిర్మల్‌ జిల్లా పార్‌పెల్లి జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గంగ సురేష్‌ తెలిపారు.

- పోషణ అనే పాఠ్యాంశంలో ఆకుల్లో పిండి పదార్థాలు కలవని నిరూపించే ప్రయోగం, కిరణజన్య సంయోగక్రియలో కార్బన్‌ డయాక్సైడ్‌ అవశ్యకత, హైడ్రిల్లా, నల్ల కాగితం ప్రయోగం, విటమిన్లు తెలిపే పట్టిక, జీర్ణ వ్యవస్థను సూచించే ఫ్లో చార్ట్‌, హరిత రేణువు, అమీబా–పోషణ పటం భాగాలు, స్వయం పోషణ– పర పోషణ, కాంతి చర్య–నిష్కాంతి చర్య మధ్య గల భేదాలు చదవాలి.
- శ్వాసక్రియలో ఈస్ట్‌తో అవాయు శ్వాసక్రియ ప్రయోగం, కార్బన్‌డయాక్సైడ్‌ ఉష్ణోగ్రత విడుదలయ్యే ప్రయోగం, వాయుగోని పటం –భాగాలు, మైటో కాండ్రియా పటం వంటివి చదవాలి.
- ప్రసరణలో పేరు పీడనం ప్రయోగం వ్యాసరూప ప్రశ్న వేసే అవకాశం ఉంది. హృదయం అంతర్నిర్మాణం–పటం భాగాలు ఏకవలయ– ద్వివలయ రక్తప్రసరణ వ్యవస్థ బేధాలు తెలపడంలో ధమనులు–సిరలు, సిస్టోల్‌–డయస్టోల్‌, దారువు–పోషక కణజాలం మధ్య గల భేదాలు గుర్తించి అవగాహన చేసుకోవాలి.
- విసర్జన అనే పాఠ్యాంశంలో నెఫ్రాన్‌ నిర్మాణం వ్యాసరూప ప్రశ్నగా అడిగే అవకాశం ఉంది. ఇతర జీవుల్లో విసర్జన అవయవాలు– అలక్లైడ్‌ మొక్క పేరు– ఉపయోగాలు పట్టిక, మానవ మూత్రపిండం అడ్డుకోత పటం –భాగాలు బేధాల, విసర్జన– స్రావం మధ్య గల భేదాలు చూసుకోవాలి.
- వనపర్తి వడ్డిచెర్లలోని నీటి వనరుల పరిస్థితి గురించి సమాచార పట్టికలు, కొత్తపల్లిలో నీటి యాజమాన్యంపై ప్రశ్నలు ఉంటాయి. అలాగే అడవుల సంరక్షణపై సమాధానాలు రాయాలి.
- హార్మోన్ల పేర్లు, వాటి ప్రభావం, ఫైటో హార్మోన్లు–ఉపయోగాలు, సమాచార పట్టిక, మానవ మెదడు పటం–భాగాలు తదతర వాటిపై అవగాహన చేసుకోవాలి.
- ప్రత్యుత్పత్తి పాఠ్యాంశంలో మానవ శుక్రకణం పటం–భాగాలు, స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలు పటం–భాగాలు, పుష్పము పటం–భాగాలు, అండం నిర్మాణం పటం, భాగాలు, భేదాలను చదవాలి.
- ఆమ్లం పత్ర ప్రయోగం సమాచార పట్టికలు, బోలాస్‌–కై మ్‌, మాస్టిఫికేషన్‌–రూమినేషన్‌ మధ్య గల భేదాలు, అంత్ర చూశకం పటం –భాగాలు చూసుకోవాలి.
- అనువంశికత–పరిణామంలో డార్విన్‌ సిద్ధాంతం, లామార్కు వాదం, లింగ నిర్ధారణ, ఏక సంకరీకరణ, ద్విసంకరీకరణ వివరణ భేదాలను తెలుసుకోవాలి.
- ఆహారపు గొలుసులు, ఆహారపు, జాలకం జైవిక వృద్ధి కరణ, శక్తి పిరమిడ్‌ సంఖ్య, పిరమిడ్‌, విషపూరిత పదార్థాల వాడకం వల్ల జరిగే ప్రభావం ఏంటో చదవాలి.

చెక్‌బౌన్స్‌ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్‌ కేసులో ఒకరికి ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ జూనియర్‌ సివిల్‌ జడ్జి, ఫస్ట్‌క్లాస్‌ జ్యుడీషియల్‌ మేజిస్ట్రేట్‌ కె.నిరోష గురువారం తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సీసీసీ నస్పూర్‌కు చెందిన వొంటెల సత్యనారాయణరెడ్డి వద్ద 2017లో కరీంనగర్‌ జిల్లా వీణవంకకు చెందిన మ్యాకల సత్యనారాయణరెడ్డి రూ.8 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సమయంలో చెక్కులు ఇచ్చాడు. ఒప్పంద ప్రకారం తీసుకున్న అప్పు చెల్లించే గడువు తీరింది. ఆ తర్వాత బ్యాంకులో చెక్కులు డిపాజిట్‌ చేయగా బౌన్స్‌ అయ్యాయి. 2019లో కోర్టులో చెక్‌బౌన్స్‌ కేసు వేశాడు. విచారణలో భాగంగా సాక్ష్యాధారాలు పరిశీలించి నేరం రుజువు కావడంతో మ్యాకల సత్యనారాయణరెడ్డికి ఏడాది సాధారణ జైలుశిక్షతోపాటు తీసుకున్న అప్పు రూ.8 లక్షలు చెల్లించాలని మేజిస్ట్రేట్‌ తీర్పునిచ్చింది.

దాడి కేసులో ఒకరికి జరిమానా

మంచిర్యాలక్రైం: పాత మంచిర్యాలకు చెందిన ఈద శ్రీనివాస్‌పై దాడి చేసిన కేసులో రావుల రాజ్‌కుమార్‌కు రూ.10వేలు జరిమానా విధిస్తూ జూనియర్‌ సివిల్‌ జడ్జి, ఫస్ట్‌క్లాస్‌ జ్యుడీషియల్‌ మేజిస్ట్రేట్‌ కె.నిరోష గురువారం తీర్పునిచ్చింది. సీఐ ప్రమోద్‌రావ్‌ కథనం ప్రకారం..శ్రీనివాస్‌కు చెందిన బ్యాంకు అటాచ్డ్‌ ఉన్న బజాజ్‌ ఫైనాన్స్‌లో రాజ్‌కుమార్‌కు నెల వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు రూ.30 వేల వాషింగ్‌ మిషన్‌ ఇప్పించాడు. వాయిదాలు సకాలంలో చెల్లించలేదు. 2021 జూన్‌ 19న డబ్బులు చెల్లించాలని అడిగినందుకు శ్రీనివాస్‌పై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదుతో రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. సాక్షాదారాలు పరిశీలించి తర్వాత నేరం రుజువుకావడంతో రాజ్‌కుమార్‌కు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్‌ తీర్పునిచ్చారు.

ఏజెన్సీ అలవెన్స్‌లు..పట్టణాల నుంచి రాకపోకలు

కాసిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేక ఏజెన్సీ అలవెన్స్‌ అందిస్తున్నా స్థానికంగా ఉండకపోవడంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. మండలంలోని లంబాడీతండా, కాసిపేట, ముత్యంపల్లి, ధర్మరావుపేట, దేవాపూర్‌ జెడ్పీ పాఠశాలలు, మోడల్‌, కేజీబీవీ, రేగులగూడ, మల్కేపల్లి, దేవాపూర్‌ గిరిజన ఆశ్రమ పాఠశాలలుండగా సుమారు 100 మంది వరకు ఉపాధ్యాయులున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి మండలంలో 16 మంది టీచర్లు ఓటరుగా నమోదు చేసుకోగా, ఇందులో 10 మంది ఈ మండలానికి చెందిన ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నవారే. మిగతా ఆరుగురు కాసిపేట మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసే స్థానికులు ఆరుగురే ఓటర్లుగా నమోదు చేసుకోవడం చూస్తే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. అంటే తొంభై శాతానికి పైగా ఉపాధ్యాయులు జిల్లా కేంద్రం, ఇతర దూరప్రాంతాల నుంచి వస్తూ ఏజెన్సీ అలవెన్స్‌లు పొందుతున్నారు. ఎస్‌ఏల పరిస్థితి ఇలా ఉంటే ఎస్జీటీలు, ఉద్యోగులు, అధికారులు కూడా 85 శాతానికి పైగా ఇతర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్నవారే కావడం గమనార్హం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జాబితా చూసిన స్థానికులు, నాయకులు ముక్కున వేలేసుకున్నారు. ఏజెన్సీ అలవెన్స్‌లు పొందుతూ పట్టణ ప్రాంతాల నుంచి రావడంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

దిలావర్‌పూర్‌: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మాడేగాం అనుబంధ గ్రామమైన కదిలికి చెందిన ధానూర్‌ పాపన్న (34) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవలు చేసేవాడు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి పాపాన్న.. ఆలయానికి వెళ్తాడని కుటుంబ సభ్యులు భావించారు. వెళ్లకుండా ఇంటి ఎదుట చెట్టుకు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం భార్య గంగాసాగర, కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు 10 సంవత్సరాల లోపు కుమారులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి



భోజన్న మృతదేహం

దిలావర్‌పూర్‌: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని జాలరి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సముందర్‌పల్లి అనుబంధ గ్రామమైన కాండ్లికి చెందిన కొత్తూరు భోజన్న (59) గురువారం ఉదయం గ్రామానికి ఆనుకుని ఉన్న ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌ వద్ద చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో వల చుట్టుకుని మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని దిలావర్‌పూర్‌ ఎస్సై సందీప్‌ పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బోథ్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఎల్‌.ప్రవీణ్‌ కుమార్‌ కథనం ప్రకారం.. సొనాల మండల కేంద్రానికి చెందిన బొంపాల పోశెట్టి చేనులో పనినిమిత్తం బుధవారం అదే గ్రామానికి చెందిన షేక్‌ ఇసాక్‌ వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం పోశెట్టి బైక్‌పై ఇసాక్‌తో సొనాల గ్రామానికి వస్తున్నారు. సాయంత్రం టీవీటీ క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ వేగంగా ఢీకొట్టింది. పోశెట్టి వెనకాల కూర్చున్న ఇసాక్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య షాహినాజ్‌ బేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



రాజు మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అనాథ శవానికి పోలీసులు, మున్సిపల్‌ సిబ్బంది దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. టూటౌన్‌ ఎస్సై కె.మహేందర్‌ కథనం ప్రకారం.. పల్లపు రాజు (44) బెల్లంపల్లి కాల్‌టెక్స్‌ ఏరియాలో గత కొంతకాలం నుంచి రోడ్డుపై పడేసిన చిత్తుకాగితాలు, ప్లాస్టిక్‌ కవర్లు ఏరుకుని జీవనం సాగిస్తూ రోడ్డుపై నిద్రిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం రామకృష్ణ థియేటర్‌ ముందు రోడ్డుపై రాజు అకస్మికంగా పడిపోయాడు. గమనించిన మహిళ 100కు డయల్‌ చేసి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే టూటౌన్‌ కానిస్టేబుల్‌ రాజీవ్‌ రతన్‌, హోంగార్డు సంపత్‌ ఘటనాస్థలికి చేరుకుని రాజును పరిశీలించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మద్యం తాగడంతో రాజు మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి ఎవరూ లేకపోవడంతో పోలీసులు, మున్సిపల్‌ సిబ్బంది సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు, మున్సిపల్‌ సిబ్బందిని ఎస్సై మహేందర్‌ అభినందించారు.

కాయిన్‌ కొడితే..కప్‌ పడాల్సిందే

- క్యారమ్స్‌లో రాణిస్తున్న సింగరేణి క్రీడాకారుడు
- కోలిండియా పోటీల్లో గోల్డ్‌మెడల్స్‌

శ్రీరాంపూర్‌: సింగరేణి కార్మికులు బొగ్గు ఉత్పత్తిలోనే కాదు ఆటల్లో తమకు తామే సాటి అంటున్నారు. శ్రీరాంపూర్‌ ఏరియా ఆర్కే 6 గనికి చెందిన జనరల్‌ మజ్దూర్‌ కార్మికుడు రేణికుంట్ల సృజన్‌రావు క్యారమ్స్‌లో జాతీయస్థాయి పోటీల్లో రాణించి శభాష్‌ అనిపించుకుంటున్నాడు. బోర్డుపై కూర్చొని కాయిన్స్‌ కొడితే కప్‌ తన ఖాతాలో పడాల్సిందే అంటున్నాడు. తనదైన ఆట తీరుతో పలు బహుమతులు సాధించాడు. ఈయన 2020లో కారుణ్య కింద సింగరేణిలో ఉద్యోగంలో చేరారు. సింగరేణిలో రాక ముందే ఆయనకు ఈ ఆటపై పట్టుంది. హైస్కూల్‌ లెవల్‌ నుంచే క్యారమ్స్‌పై పట్టు సాధించాడు. ఇంటర్‌, డిగ్రీలో తన ఆటకు మరింత పదును పెట్టాడు. కళాశాల స్థాయిలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు. నిజామాబాద్‌లోని భీంగల్‌, హైదరాబద్‌లోని ఖైరతాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్‌ పోటీల్లో ప్రతిభ కనబర్చి పలు బహుమతులు అందుకున్నాడు.



గోల్డ్‌ మెడల్‌ అందుకుంటున్న సృజన్‌రావు

జాతీయస్థాయిలో పోటీల్లో..

జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఆలిండియా పబ్లిక్‌ సెక్టార్‌ కంపెనీల పోటీల్లో ప్రతిభ కనబర్చి పలు బహుమతులు సాధించాడు. 2024 మార్చిలో ముంబయిలో జరిగిన ఈ పోటీల్లో సెమీస్‌ వరకు వెళ్లాడు. అదే ఏడాది మధ్యప్రదేశ్‌లోని సింగరోలిలో జరిగిన కోలిండియా పోటీల్లో సింగిల్స్‌లో సిల్వర్‌ మెడల్‌ సొంతం చేసుకున్నాడు. 2025 జనవరిలో జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన కోలిండియా పోటీల్లో సింగిల్స్‌లో గోల్డ్‌ మెడల్‌ అందుకున్నాడు. ఈ పోటీల్లో సింగరేణి జట్టు టీం ఛాంపియన్‌ సాధించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు.

ప్రోత్సహిస్తే శిక్షణ ఇస్తాను



కంపెనీ మరింత ప్రోత్సాహిస్తే నేను మెరుగ్గా ఆడటమే కాకుండా మరింత మందికి శిక్షణ ఇచ్చి క్రీడాకారులను తయారు చేస్తాను. కంపెనీ క్లబ్‌లో శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా. అధికారులు దీనికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తే ఉద్యోగులతోపాటు వారి పిల్లలకు ఆట నేర్పించాలని ఉంది. ఈ ఆటలో మహిళలు తక్కువగా ఉన్నారు. పోటీ లేనందున వారు నేర్చుకుంటే సులువుగా రాణించగలుగుతారు. జాతీయ స్థాయిలో పాల్గొంటే చాలు బ్యాంకుల్లో తదితర సంస్థల్లో పిలిచి ఉద్యోగాలు ఇస్తున్నారు. – సృజన్‌రావు

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటికి తీసుకువస్తున్న జాలర్లు

కోటపల్లి: మండలంలోని ఎర్రాయిపేట సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానానికి వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మహాశివరాత్రి పురస్కరించుకుని పార్‌పల్లి గ్రామానికి చెందిన రాదండి రాజేశ్‌ (46), కుటుంబసభ్యులతో కలిసి బుధవారం నదిలో పుణ్యస్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఎస్సై రాజేందర్‌ ఆధ్వర్యంలో గజఈతగాళ్ల పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం గురువారం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్‌



సీజ్‌ చేసిన ట్రాక్టర్లతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్‌(జైనథ్‌): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌ చేసినట్లు జైనథ్‌ సీఐ డి.సాయినాథ్‌ తెలిపారు. జైనథ్‌ మండలంలోని పెన్‌గంగా నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారంతో గురువారం ఉదయం ఏఎస్సైలు సిరాజ్‌, స్వామి, పోలీస్‌ సిబ్బందితో కలిసి లేఖర్వాడ వద్ద తనిఖీలు నిర్వహించారు. మూడు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సీజ్‌ చేసిన ట్రాక్టర్లను జైనథ్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సూర్యాపూర్‌లో అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు



తలపడుతున్న మల్లయోధులు

కుంటాల: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సూర్యాపూర్‌లో గురువారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. నిజామాబాద్‌, కరీంనగర్‌తోపాటు కర్ణాటక మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది మల్లయోధులు పాల్గొన్నారు. అంతకుముందు సూర్యాపూర్‌ రాజరాజేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ పూజలు చేశారు. అనంతరం కుస్తీ పోటీలను వీక్షించారు. పోటీల్లో గెలుపొందిన విజేతకు రూ.6100 నగదు, వెండి కడియం బహూకరించి సన్మానించారు. రెండో విజేతకు రూ.3 వేల నగదు అందజేసి సత్కరించారు. ఎస్సై సీహెచ్‌ భాస్కరాచారి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్‌ జుట్టు అశోక్‌, డీసీసీబీ డైరెక్టర్‌ వెంకటేశ్‌, నాయకులు వెంగల్‌రావు, రాజరాజేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

కావడి పడితేనే తాగునీరు..



దహెగాం: మండలంలోని చిన్నఐనం గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. మిషన్‌ భగీరథ పైపులైన్‌ సమస్య కారణంగా నీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామంలోని మూడు వాడలకు రోజు విడిచి రోజు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. రోజురోజుకు ఎండలు తీవ్రం అవుతుండడంతో గ్రామస్తులు తాగునీటికి అల్లాడిపోతున్నారు. గ్రామానికి అర కిలోమీటరు దూరంలోని ఒర్రె నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గురువారం గ్రామానికి చెందిన వృద్ధుడు ఏమ రాజయ్య కావడిలో బిందెలతో నీరు తెచ్చుకుంటుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

ప్రీ వెడ్డింగ్‌ షూటింగ్‌, డీజేల బహిష్కరణ



ప్రతిజ్ఞ చేస్తున్న తండావాసులు

ఉట్నూర్‌రూరల్‌: ప్రస్తుత రోజుల్లో ప్రీ వెడ్డింగ్‌, హల్దీ, డీజేల, లైటింగ్‌ ఖర్చులు తడిచి మోపెడవుతున్నాయి. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుని భావితరాలకు అందించాలనే ఆలోచనతో ఉట్నూర్‌ మండలం శ్యాంనాయక్‌తండాలో పెద్దలు ఓ నిర్ణయం తీసుకున్నారు. శివరాత్రి పురస్కరించుకుని గురువారం గ్రామ ఆలయ ప్రాంగణంలో తండావాసులు ప్రీ వెడ్డింగ్‌ షూటింగ్‌, డీజేలు బహిష్కరించారు. గ్రామంలో ఎలాంటి ప్రీవెడ్డింగ్‌ షూటింగ్‌, హల్దీ, డీజేలు పెట్టవద్దని ప్రతిజ్ఞ చేశారు.